
ప్రజాశక్తి

ఆదివారం 25 ఆగస్టు 2024



కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తా: చైర్‌పర్సన్

ప్రజాశక్తి - సాలూరు

మున్సిపాలిటీలో వివిధ సెక్షన్ల అధికారుల పనితీరు బాగోలేనందున కలెక్టర్, మున్సిపల్ ఆర్డీలకు ఫిర్యాదు చేస్తానని చైర్‌పర్సన్ పువ్వుల ఈశ్వరమ్మ చెప్పారు. శనివారం ఆమె స్థానిక మున్సిపల్ కార్యాలయంలో కొంతమంది సెక్షన్ అధికారులతో సమీక్ష నిర్వహించారు. అధికారులు సమయపాలన పాటించడంలేదని, ఎవరికి నచ్చిన విధంగా వారు వ్యవహరిస్తున్నారని చెప్పారు. అధికారుల పనితీరుపై ప్రజలు తనని ప్రశ్నిస్తున్నారని అన్నారు. ఏ సెక్షన్‌లో ఏం జరుగుతుందో తెలియడం లేదని చెప్పారు. త్వరలో జిల్లా కలెక్టర్, ఆర్డీలకు ఫిర్యాదు చేస్తానని చైర్ పర్సన్ విలేకరులకు చెప్పారు.

ఉలిక్కిపడ్డ భట్లభద్ర

మన్యం జిల్లాలో డెంగీ విజృంభిస్తోంది. గ్రామాల్లో అపారిశుద్ధ్యం కారణంగా దోమలు విజృంభించి జ్వరాల బారిన పడుతున్నారు. ఈనేపథ్యంలోనే జియ్యమ్మవలస మండలం బిత్రపాడు పంచాయతీ భట్లభద్ర గ్రామంలో డెంగీ బారిన పడిన తల్లీకూతురు మృతి చెందిన ఘటన చోటు చేసుకుంది. ఈ సంఘటనతో గ్రామస్తులు ఒక్కసారిగా ఉలిక్కిపడ్డారు.

- డెంగీతో తల్లీ కూతురు మృతి
- పది మంది వరకు జ్వరపీడితులు
- పారిశుధ్యంపై అధికారుల శీతకన్ను





మృతి చెందిన తల్లి దుర్గ ; కుమార్తె చైతన్య (ఫైల్)

ప్రజాశక్తి -జియ్యమ్మవలస

భట్లభద్రలో గత పదిరోజులుగా పలువురు జ్వరాలతో బాధ పడుతున్నారు. గ్రామంలో అపారిశుద్ధ్యం తాండవించడంతో జ్వరాలు బారినపడినట్లు తెలుస్తోంది. ఈనేపథ్యంలోనే గ్రామానికి చెందిన మేరువ పరంధామ భార్య మేరువ దుర్గ (47), కుమార్తె చైతన్య (20) డెంగీ జ్వరం బారిన పడ్డారు. కొద్ది రోజులుగా దుర్గ పార్వతీపురం ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందింది. తగ్గకపోవడంతో రెండు రోజుల క్రితం మెరుగైన వైద్యం కోసం విజయనగరం తిరుమల-మెడికవర్ ఆసుపత్రికి తరలించారు. అయినప్పటికీ పరిస్థితి విషమించి శుక్రవారం వేకువజామున మృతి చెందింది. కుమార్తె చైతన్య పరిస్థితి కూడా బాగోలేకపోవడంతో శ్రీకాకుళంలోని మెడికవర్ ఆస్పత్రికి తరలించారు. ఆమె కూడా పరిస్థితి విషమించడంతో శుక్రవారం సాయంత్ర ప్రాణాలు విడిచింది. వీరిద్దరూ ఒకేరోజు కొద్ది గంటల సమయం తేడాలో మృతి చెందడంతో గ్రామస్తులు శోకసంద్రంలో మునిగిపోయారు. వ్యవసాయం చేసుకుంటూ ఒక్కగానొక్క కుమార్తెను అల్లారుముద్దుగా పెంచుకున్నామని, ఇంజినీరింగ్ చదివిస్తున్నామని, భార్య, కుమార్తె చనిపోవడంతో తాను ఎవరి కోసం బతకాలని పరంధామా రోదిస్తున్న తీరు గ్రామస్తులను కలచివేసింది. చైతన్య విశాఖపట్నంలోని అవంతి కళాశాలలో ఇంజినీరింగ్ తృతీయ సంవత్సరం చదువుతుంది. జ్వరం రావడంతో ఇంటికి వచ్చేసింది. తల్లికి కూడా జ్వరం రావడంతో ఇద్దరూ ఆస్పత్రిలో చేరి కన్నుమూశారు. ఇదిలా ఉండగా అదే గ్రామానికి చెందిన అల్లు వెంకట నాయుడు ఇటీవల డెంగీతో మతి చెందినట్లు గ్రామస్తులు తెలిపారు. ప్రస్తుతం మరోపది మంది వరకు జ్వరాలతో బాధపడుతున్నారు.

గ్రామంలో వైద్య శిబిరం ఏర్పాటు

వర్షాకాలం ప్రారంభంతో జిల్లా వైద్యాధికారుల ఆదేశాల మేరకు సంబంధిత ఆరోగ్య కేంద్రాల్లో వైద్యులు తమ సిబ్బందితో వైద్య శిబిరాలను ఏర్పాటు చేస్తున్నప్పటికీ జ్వర పీడితుల సంఖ్య నానాటికి పెరిగి ప్రైవేటు ఆసుపత్రులను ఆశ్రయిస్తున్నారు. తాజా ఘటనతో సమాచారం తెలుసుకున్న మాదలంగి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ తనూజ స్థానిక పాఠశాలలో మెడికల్ క్యాంప్ నిర్వహించి వైద్య సేవలు అందిస్తున్నారు. అయితే జ్వరం వస్తే కోలుకుంటామో లేదో అన్న పరిస్థితిలో ప్రజలు ఆందోళన చెందుతున్నారు. రెండు రోజుల క్రితం రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్య కుమార్ యాదవ్ ఆసుపత్రిలో మందులు, సిబ్బంది కొరత లేకుండా అన్ని చర్యలు తీసుకుంటామని చెప్పారు.




రోధిస్తున్న పరంధామ

డెంగీ లక్షణాలు ఉన్నట్లు ప్రభుత్వాసుపత్రుల్లో పరీక్షలు నిర్వహించేందుకు తగిన అవకాశాలు రోగులు ఇబ్బందులు పడుతున్నారు. మరోవైపు గ్రామాల్లో పారిశుధ్య లోపం కొట్టొచ్చినట్లు కనిపిస్తోంది. దోమలు వృద్ధి చెంది ప్రజల ప్రాణాలను బలిగొంటున్నాయి. ఈ నేపధ్యంలోనే డెంగీతో మేరువ దుర్గ, తన కుమార్తె మేరువ చైతన్య మృతి చెందారని గ్రామస్తులు ఆవేదన చెందుతున్నారు. అధికారులు స్పందించి గ్రామాల్లోని పారిశుధ్యం మెరుగుపరిచి తగు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుకుంటున్నారు.



చైతన్యను కడసారి చూసేందుకు వచ్చిన ఇంజినీరింగ్ కళాశాల మిత్రులు



గ్రామంలో ఆరోగ్య పరీక్షలు చేస్తున్న వైద్యులు

గ్రామ సభలు విజయవంతం : కలెక్టర్

ప్రజాశక్తి - పార్వతీపురంరూరల్

జిల్లాలో గ్రామ సభలు విజయవంతంగా నిర్వహించినట్లు కలెక్టరు ఎ.శ్యామ్‌ప్రసాద్ తెలిపారు. గ్రామాల సర్వతోముఖాభివృద్ధికి గ్రామ సర్పంచ్ అధ్యక్షతన శుక్రవారం గ్రామ సభలను పారదర్శకంగా నిర్వహించామన్నారు. జిల్లాలో 451 గ్రామ పంచాయతీల్లో దిగ్విజయంగా పూర్తి చేశామన్నారు. జిల్లాలో జరిగిన స్వర్ణ గ్రామపంచాయతీ సభల్లో రాష్ట్ర మహిళా శిశు సంక్షేమ శాఖ, గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మిడి సంధ్యా రాణి, రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్య కుమార్ యాదవ్, ఎమ్మెల్యేలు బోనెల విజయ్ చంద్ర, తోయక జగదీశ్వరి, నిమ్మక జయకష్ణ, అధికారులు, ఇతర రాజకీయ ప్రతినిధులు పాల్గొన్నారని తెలిపారు. గ్రామసభ నిర్వహణకు ఏర్పాటు చేసిన గ్రామ కమిటీలు 2024-25 సంవత్సరానికి సంబంధించి గ్రామంలో మౌళిక సదుపాయాల కల్పన, ఉపాధి హామీ చట్టం పనులకు ప్రతిపాదనలు చేశారని తెలిపారు. ప్రతి గ్రామ పంచాయతీ నుండి వాటి పరిమాణం మేరకు సుమారు 50 నుంచి 150 వరకు పనులకు సంబంధించిన ప్రతిపాదనలు తయారుచేశామని ఆమె తెలిపారు. గ్రామసభల నిర్వహణలో భాగంగా ఉపాధి హామీ చట్టం ద్వారా వేతనాలు పొందేవారి హక్కులు, అర్హతలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించామన్నారు. ఇప్పటికే మంజూరు చేసిన, పురోగతిలో ఉన్న పనులను గ్రామ సభల్లో చదివి ప్రజలకు వివరించినట్టు తెలిపారు. ఉపాధి హామీ చట్టంలో భాగంగా వ్యవసాయ అనుబంధ పనులు, కొత్తగా ఫీడర్ కాలువ నిర్మాణం, కొత్త పంట కాలవ నిర్మాణం, రైతుల భూముల్లో ఫార్మ్ ఫాండ్ నిర్మాణం, వ్యక్తిగత భూముల్లో భూఅభివృద్ధి పనులు, పండ్ల తోటల్లో రింగు ట్రెంచుల నిర్మాణం, పండ్ల తోటల్లో భూసార సంరక్షణ కందకాలు తవ్వడం వంటి పనులకు ప్రతిపాదనలు స్వీకరించినట్లు పేర్కొన్నారు. వివిధ పనులకు తీర్మానాలు చేసినట్టు కలెక్టర్ వివరించారు.



గ్రామసభలో మాట్లాడుతున్న కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్ (ఫైల్)

ఇసుక వెలికితీత పనులు చేపట్టాలి : జెసి

ప్రజాశక్తి - భామిని

మండలంలోని నేరడి బ్యారేజీ కుడి కాలువ ఓపెన్ హెడ్ రెగ్యులేటర్‌ను జాయింట్ కలెక్టర్ ఎస్ఎస్ శోభిక శనివారం పరిశీలించారు. ఓపెన్ హెడ్ రెగ్యులేటర్‌లో ఎంత మేరకు ఇసుక పేరుకు పోయింది, ఎంతో మొత్తం ఇసుక తొలగించాల్సి వుంది అన్న అంశాలు పరిశీలించారు. ఓపెన్ హెడ్ రెగ్యులేటర్ నుంచి ఇసుక తొలగింపు చేపట్టాలని ఇరిగేషన్ శాఖకు సూచించారు. ఓపెన్ హెడ్ రెగ్యులేటర్ నుంచి బయటకు తీసిన ఇసుక నేరడి బ్యారేజి సమీపంలో డంపింగ్ చేయాలని సూచించారు. అనంతరం నిబంధనల ప్రకారం ఇసుక తరలింపునకు చర్యలు చేపడతామని తెలిపారు. కార్యక్రమంలో పాలకొండ ఆర్‌డిఒ వివి రమణ, మైనింగ్, ఇరిగేషన్, శాఖ అధికారులు తహశీల్దార్ ఉమామహేశ్వరరావు ఉన్నారు.

పార్కు స్థలాన్ని పరిశీలన

సీతంపేట : మండలంలోని పనుకువలసలో ఎంఎస్ఎంఇ పార్క్ ఏర్పాటు కోసం స్థలాన్ని జాయింట్ కలెక్టర్ శోభిక పరిశీలించారు. అధికారులతో మాట్లాడారు. అనంతరం ఇ- క్రాప్ బుకింగ్ నమోదు గురించి అధికారులను అడిగి తెలుసుకున్నారు. వరి నాట్లు ఏ విధంగా ఉన్నాయని పనుకువలస పొలంలోకి వెళ్లి పరిశీలించారు. జెసి ఐటిడిఎ పిఒ వివి రమణ, తహశీల్దార్ అప్పలరాజు, పిహెచ్ఒ వెంకట గణేష్, ఎఒ శ్రీదేవి, ఆర్ఐ వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు



నేరడి బ్యారేజిని పరిశీలిస్తున్న జెసి శోబిక

10 కేజీల గంజాయి పట్టివేత

ప్రజాశక్తి - పాచిపెంట

అక్రముగా తరలిస్తున్న 10 కేజీల 210 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై పి.నారాయణరావు తెలిపారు. ఆయన అందించిన వివరాలిలా ఉన్నాయి. శుక్రవారం సాయంత్రం మండలంలోని రోడ్డవలసను ఎస్సైతో పాటు పోలీసులు సందర్శించారు. అదే సమయంలో రోడ్డవలస సమీపాన గల ఘాట్ రోడ్డు జంక్షన్ వద్ద ముగ్గురు అనుమానిత వ్యక్తుల్ని పట్టుకోగా, వారి వద్ద 10 కేజీల 210 గ్రాముల గంజాయి లభ్యమైంది. గంజాయిని స్వాధీనం చేసుకుని ముగ్గురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు. వీరిలో తమిళనాడుకు చెందిన శక్తి మురుగన్, ప్రవీణ్‌కుమార్, ఆంధ్రాకు చెందిన సురేష్ ఉన్నారు. వీరిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై తెలిపారు.

రోడ్లు బాగు చేయాలి

- నిరసన తెలిపిన ఒడిశా లారీ అసోసియేషన్
- 10 నుంచి బంద్

ప్రజాశక్తి - కొమరాడ

పార్వతీపురం నుంచి కూనేరు వరకు గల అంతర్ రాష్ట్ర రహదారిపై ఉన్న గోతులకు మరమ్మతులు చేసి ప్రమాదాలు నివారించాలని సిపిఎం నాయకులు కొల్లి సాంబమూర్తి డిమాండ్ చేశారు. మండలంలోని గుమడ గ్రామ సమీపంలో అంతర్రాష్ట్ర రహదారిపై ఏర్పడిన భారీ గోతుల వద్ద సిపిఎం ఆధ్వర్యంలో ఒడిస్సా లారీ అసోసియేషన్‌తో పాటు వర్కర్స్ యూనియన్, పలు సంఘాల ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా సిపిఎం నాయకులు కొల్లి సాంబమూర్తి, రాయగడ జిల్లా లారీ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు వై. కొండబాబు మాట్లాడుతూ గడిచిన రెండున్నరేళ్లుగా పార్వతీపురం నుంచి కూనేరు మీదుగా మూడు రాష్ట్రాలకు వెళ్లే గోతుల వద్ద ఈ పనులు చేపట్టకపోవడంతో ప్రతిరోజు అటు మూడు రాష్ట్రాలకు వెళ్ళే ప్రయాణికులు, వాహనదారులు అనేక ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. అధ్వానంగా ఉన్న రహదారులపై ఇప్పటికే అనేక ప్రమాదాలు జరిగి పలువురు గాయపడ్డారన్నారు. రోడ్లు మరమ్మతులు చేయాలని సిపిఎం అనేకసార్లు వివిధ రూపాల్లో ఆందోళనలు చేసినా అధికారులు పట్టించుకోవడంలేదని ఆందోళన వ్యక్తం చేశారు. గోతుల్లో వాహనాలు దిగిపోయి గంటల కొద్దీ ట్రాఫిక్ నిలిచిపోయి ప్రయాణికులు ఇబ్బందులు పడే పరిస్థితి ఉందని అన్నారు. సెప్టెంబర్ 10లోగా రోడ్లు మరమ్మతులు చేపట్టకపోతే పెద్ద ఎత్తులో బంద్ చేపడుతామని తెలిపారు. కార్యక్రమంలో రాయగడ లారీ అసోసియేషన్ నాయకులు కోట సూర్య, శ్యామల్, ధర్మ, రాజేష్, ఎం.రమణ, ఎ.శివ, సిపిఎం నాయకులు రెడ్డి శివున్నాయుడు, డ్రైవర్లు, ప్రయాణికులు పాల్గొన్నారు.



రోడ్డుపై నిరసన తెలుపుతున్న రాయగడకు చెందిన లారీ అసోసియేషన్ నాయకులు

తప్పని డోలిమోత

వృద్ధుడిని మైదాన ప్రాంతానికి తరలింపు

ప్రజాశక్తి - పాచిపెంట

ఎన్ని ప్రభుత్వాలు మారినా ఏజెన్సీ ప్రాంతాల్లో గిరిజనులకు డోలిమోతలు తప్పడం లేదు. రహదారి సౌకర్యం లేకపోవడంతో ఎత్తయిన కొండలపై నుంచి రాళ్లు రప్పలు దాటుకుంటూ అనేక కష్టాలకు ఓర్చి మైదాన ప్రాంతాలకు రోగులను డోలిపై మోసుకొస్తున్నారు. ఇలా మండలంలో కనీసం రహదారి సదుపాయాల్లేని అనేక గిరిజన గ్రామాలు ఉండడంతో ప్రజలకు అత్యవసర సేవలు సైతం అందని పరిస్థితి ఉంది. అత్యవసర సమయాల్లో ఆసుపత్రికి తరలించాలంటే రహదారి లేకపోవడంతో రోగి నడవలేని పరిస్థితుల్లో మంచాలు కట్టుకొని డోలీ రూపంలో కిందకు దించాల్సిన పరిస్థితి నెలకొంది. ఇలాంటి ఘటనలు నిత్యకృత్యమవుతున్నాయి. అయినా పాలకుల్లోనూ, అధికారుల్లో ఎలాంటి స్పందన ఉండకపోవడంతో గిరిజనులకు కష్టాలు తప్పడంలేదు. ఎప్పటిలాగే శనివారం కూడా డోలీపై రోగిని మైదాన ప్రాంతానికి తీసుకొచ్చిన సంఘటన మండలంలో చేసుకుంది. ఇందుకు సంబంధించిన వివరాలిలా ఉన్నాయి.

మండలంలోని గొట్టూరు పంచాయతీ రిట్లపాడుకు చెందిన సేబి ఆశయ్య (60) అనారోగ్యానికి గురవ్వడంతో వైద్యం కోసం శనివారం గురువునాయుడుపేట పిహెచ్‌సికి తీసుకొచ్చారు. రెట్లపాడు నుండి మైదాన ప్రాంత రహదారికి చేరాలంటే సుమారు 15 కిలోమీటర్లు కొండలు, గుట్టలు, రాళ్ళ రప్పలు దాటి ఆశయ్యను డోలిపై తీసుకు రాగా, మరి కొంతమంది జ్వరపీడితులు కాలినడకన పిహెచ్‌సికి చేరుకున్నారు. కొన్ని సమయాల్లో సకాలంలో అందక రోగులు మార్గమధ్య మృత్యువాతపడిన సంఘటనలు కూడా ఉన్నాయి. ఇప్పటికైనా పాలకులు, అధికారులు స్పందించి అత్యవసర సమయంలో వైద్య సేవలు నిమిత్తం తమ గ్రామానికి అంబులెన్స్ వచ్చేలా పక్కా రహదారి కల్పించాలని గిరిజనులు కోరుతున్నారు.



ఆశయ్యను డోలిపై తీసుకొస్తున్న గిరిజనులు



మంత్రి సంధ్యారాణికి వినతిని అందజేస్తున్న ఆశా కార్యకర్తలు, నాయకులు

సమస్యలు పరిష్కరించాలని మంత్రికి వినతి

ప్రజాశక్తి - సాలూరు

తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఆశా వర్కర్లు, సామాజిక ఆరోగ్య కార్యకర్తలు శనివారం గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మడి సంధ్యారాణికి వినతిపత్రం అందజేశారు. ఆశా వర్కర్స్ యూనియన్ నాయకులు వై.రాజేశ్వరి, శ్రీదేవి, కన్నతల్లి ఆధ్వర్యాన ఆశా వర్కర్లు, సామాజిక ఆరోగ్య కార్యకర్తలు మంత్రిని ఆమె నివాసంలో కలిసి సమస్యల గురించి వివరించారు. పెరిగిన ధరలకు అనుగుణంగా కనీస వేతనం ఇవ్వాలని కోరారు. రూ.10లక్షల గ్రూపు ఇన్సూరెన్స్ సౌకర్యం వర్తింపజేయాలని డిమాండ్ చేశారు. రూ.5 లక్షల రిటైర్మెంట్ బెనిఫిట్స్ కల్పించాలని కోరారు. సంబంధం లేని పనులు చేయించొద్దని కోరారు. కరోనా సమయంలో మరణించిన వారికి రూ.20లక్షల ఎక్స్‌గ్రేషియా మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. విధి నిర్వహణలో మరణించిన వారి కుటుంబాల్లో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని కోరారు. సామాజిక ఆరోగ్య కార్యకర్తలను ఆశాలుగా మార్చాలని సామాజిక ఆరోగ్య కార్యకర్తలు మంత్రిని కోరారు. సిఐటియు జిల్లా కార్యదర్శి ఎన్వైనాయుడు ఆధ్వర్యాన వారు మంత్రిని కలిసి వినతిపత్రం అందజేశారు.

మన్యంలోకి మార్సియస్ పైనాపిల్

రైతులకు మంచి ఆదాయం

ప్రజాశక్తి - సీతంపేట

సీతంపేట ఏజెన్సీలో అధికంగా పైనాపిల్‌పై గిరిజనులు మొగ్గు చూపుతున్నారు. గిరిజన ప్రాంతంలో పంట ఎక్కువగా పండుతుంది. అటవీ ఉత్పత్తుల్లో గిరిజనులకు ఈ పంట కుసిమి, శంభాం, కడగండి, పూతికవలస, మర్రిపాడు పరిసర ప్రాంతాల్లో ఎక్కువగా సాగవుతుంది. అయితే గిరిజనులకు ఆర్థికంగా చేయూతనిచ్చేది పైనాపిల్ ఒకటని చెప్పవచ్చు. సీతంపేట ఏజెన్సీలో ఇప్పటి వరకు సింహాచలం లోకల్ వెరైటీ ఫైనాపిల్ మాత్రమే గిరిజన రైతులు సాగు చేస్తున్నారు. అయితే దీనికన్నా అధికంగా పంట దిగుబడి, ఎక్కువ కాలం నిల్వ ఉంటుంది మార్సియస్ ఫైనాపిల్. తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడి రాబడి రావాలనే ఉద్దేశంతో కలెక్టర్ చొరవతో పిహెచ్ఒ గణేష్ ప్రత్యేక కృషితో కేరళ రాష్ట్రం ఎర్నాకుళం ఇరిడి జిల్లా వజ్జు కులం ప్రాంతం నుండి కింగ్ ఆఫ్ మార్సియస్ (అనాస పనస) ఇదొక కొత్త రకం గిరిజనులకు పరిచయం చేస్తున్నారు. ఈ రకం ఫైనాపిల్ పైనాపిల్ తెప్పించడానికి ఉద్యాన శాఖ అధికారులు ఇప్పటికే సన్నాహాలు చేస్తున్నారు. ఇది దేశంలోనే పైనాపిల్‌లో కింగ్ అని పిలుస్తారు. మార్సియస్ ఫైనాపిల్ ప్రయోగాత్మకంగా చేయడానికి ఇప్పటికే రంగం సిద్ధం చేశారు. సీతంపేట ఐటిడిఎ పరిధిలో సీతంపేట, భామిని మండలాల్లో తొలి విడత 110 ఎకరాల్లో ముందుగా మార్సియస్ పైనాపిల్ వేయడానికి రంగం సిద్ధం చేశారు. దీనిపై ఇప్పటికే రైతులకు కూడా దీనిపై అవగాహన కల్పించారు



మార్సియస్ ఫైనాపిల్ ముక్కల కోసి 15 రోజుల వరకు నిల్వ ఉంటుంది, జ్యూస్‌గా ఉపయోగించవచ్చు. తక్కువ పెట్టుబడి, అధిక దిగుబడి రాబడి ఉంటుంది. కనీసం కేజీ వరకూ బరువుతో పాటు 6.4 సెంటీమీటర్ల పొడవు ఉంటుంది. షాపుల్లో ఆకర్షణీయంగా కనిపిస్తుంది.

మార్సియస్ ఫైనాఫిల్ మొక్కలు పంపిణీ : పిఒ

ఫైనాపిల్ పంటలో మార్సియస్ అనే కొత్త రకం ఫైనాఫిల్ మొక్కలను సీతంపేట, భామిని మండలాల్లో ప్రయోగాత్మకంగా గిరిజన రైతులకు పంపిణీ చేయనున్నట్లు ఐటిడిఎ పిఒ వివి రమణ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పథకం కింద ఎంపికైన రైతుకు ఎకరాకు 8వేల మొక్కలతో పాటు ఎరువులు, చేతిపంపులు పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. గరిష్టంగా ఒక రైతుకు ఒక ఎకరాకు మాత్రమే ఇవ్వబడుతుందన్నారు. ఈ పథకంపై ఆసక్తి కలిగిన రైతులు వారి భూమికి సంబంధించిన పట్టాదారు పాస్ పుస్తకం, ఆధార్ కార్డు జిరాక్స్, రైతు ఫోటోతో దగ్గరలో ఉన్నటువంటి రైతు భరోసా కేంద్రంలో ఈనెల 31లోగా దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

ఆసక్తి ఉన్నవారు దరఖాస్తు చేసుకోవచ్చు




మార్సియస్ పైనాపిల్ సాగుపై ఆసక్తి ఉన్నవారు రైతు సేవా కేంద్రాల్లో ఈనెల 31 లోగా విత్తనాల పైనాపిల్ మొక్కలు కోసం దరఖాస్తు చేసుకోవచ్చు. సెప్టెంబర్ 20లోగా టెండర్లు పూర్తి చేసుకుని వీటిని రైతులకు అందజేస్తాం. ఆధార్ కార్డు, పట్టాదారు పాస్ పుస్తకం తప్పనిసరిగా ఉండాలి. ఎకరానికి 8వేలు మార్సయస్ పైనాపిల్ మొక్కలను 90శాతం సబ్సిడీపై అందజేస్తాం. వీటితో పాటు రూ.5వేలు విలువచేసే ఎరువులు, బ్యాటరీ స్ప్రేయర్ అందిస్తాం. ఆసక్తి ఉన్న రైతులు 10 శాతం మాత్రమే నగదు చెల్లించాల్సి ఉంటుంది.

ఎస్‌వి గణేష్, ప్రాజెక్ట్ ఆర్టికల్చర్ అధికారి సీతంపేట ఐటిడిఎ.

గ్రామసభల మాటున సర్పంచులు టార్గెట్ కారాదు

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

మహాత్మగాంధీ పేరు వింటే ఆయన కలలుగన్న గ్రామ స్వరాజ్యం గుర్తుకు వస్తుంది. బహుశా అందుకే 2005లో కమ్యూనిస్టుల మద్ధతుతో ఏర్పడిన యుపిఎ-1 ప్రభుత్వం కనీస ఉమ్మడి కార్యక్రమంలో భాగంగా గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని గాంధీ పేరున రూపకల్పన చేశారు. ఈ చట్టం ప్రకారం ప్రతి కుటుంబానికి వంద రోజులు పని కల్పించడంతోపాటు ఆయన ఆశించిన విధంగా గ్రామాల్లో చేపట్టబోయే పనులకు గ్రామ సభల ద్వారా ఆమోదం తప్పనిసరి చేశారు. ఈ సభలు పంచాయతీ సర్పంచి అధ్యతక్షన జరగాలి. తద్వారా గ్రామ స్థాయి నుంచి ప్రజాస్వామ్య పద్ధతులు నెలకొల్పాలన్నది కమ్యూనిస్టుల ఆకాంక్ష. సుదీర్ఘకాలంలో కేరళ రాష్ట్రంలో పాలన సాగించిన వామపక్ష ప్రభుత్వాలు స్థానిక సంస్థల ప్రత్యేకతలు, అధికారాలు, బాధ్యతలు దేశానికే ఆదర్శంగా నిలిచాయి. ఈ సంగతి కాస్త అటుంచితే... గాంధీ పేరున ఏర్పాటైన ఉపాధి హామీ చట్టం అమల్లో భాగంగా పనుల ఎంపిక, ఆమోదానికి టిడిపి - జనసేన కూటమి ప్రభుత్వం గ్రామ సభలు తప్పనిసరి చేస్తూ పునరుద్ధాటించింది. ఈ పిలుపులో భాగంగా విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లాల్లో అన్నిచోట్లా గ్రామసభలు నిర్వహించారు. అయితే, ఈసభల్లో తమను పక్కనబెట్టి గ్రామ సభలు నిర్వహించారని, టిడిపి, జనసేన నాయకుల



పెత్తనం కాస్త ఎక్కువైందని వైసిపికి చెందిన స్పంచలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అంతమాత్రాన గ్రామ సభలే సరికాదని చెప్పలేం. ఎందుకంటే గ్రామ సభ అనేసీ ప్రజాస్వామ్యంలో ప్రాథమిక బాధ్యత. ఆ సభల్లో సర్పంచులను భాగస్వామ్యం చేయడం కూడా అంతే కర్తవ్యం. ఈ పద్ధతి పాటించడం లేదన్నది వైసిపి మద్ధతుగావున్న సర్పంచులు, ఇతర నాయకుల వాదన. గ్రామాల్లో రాజకీయంగా, ఆర్థికంగా అనగదొక్కేందుకు, అవమానించేందుకే ఈ గ్రామ సభలు పెడుతున్నారని కూడా మరికొందరు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వాస్తవానికి ఇప్పటికే పనులన్నీ గ్రామ సభ తీర్మాశ్రీంతోనే చేపడుతున్నారు. కాకపోతే సభలు నిర్వహించకుండా, పెత్తందారులు, లేదా సర్పంచి, ఫీల్డ్ అసిస్టెంట్ల ఇష్టారాజ్యంగా తీర్మాశ్రీఖఱ రాసేసి అమలు చేస్తున్నారు. ఇటువంటి పరిస్థితుల్లో గ్రామ సభలు మంచివైనప్పటికీ గడిచిన ఐదేళ్లు వైసిపి మద్ధతుదారులు చేసిన తప్పులనే నేడు టిడిపి - జనసేన ప్రభుత్వాలు చేయడం వల్ల ఉపయోగం లేదన్నది పబ్లిక్ టాక్. పనుల ఆమోదంలోనే ఇంతలా రాజకీయాలు పెచ్చుమీరితే గ్రామాల్లో చేసిన పనిబట్టి భవిష్యత్తులో మెటీరియల్ కాంపొనెంట్ పనులు కూడా జరుగుతాయి. వీటి కేటాయింపులో కూడా సర్పంచులు జోక్యం లేకుండా కేటాయింపులు జరిగే అవకాశం లేకపోలేదు. ఇప్పటికే విజయనగరం జిల్లాల్లో రోడ్లు, కాలువలు, తదితర మౌలిక సదుపాయాల కల్పనకు రూ.208కోట్లు సిద్ధంగా ఉన్నాయని, వీటిని వెండార్ పేరిట టిడిపి, జనసేన నాయకులకు కట్టబెట్టుకునేందుకే గ్రామసభల పేరిట గ్రామాల్లో పెత్తనం చలాయించేందుకు ప్రభుత్వం వ్యూహాత్మకంగా వ్యవహరిస్తోందని వైసిపి నాయకులు. అదే పార్టీకి చెందిన సర్పంచుల వాదన. ఆచరణ ఎలా ఉంటుందో కొద్దిరోజుల్లోనే తెలిపోతుందని పలువురు చర్చించు కుంటున్నారు.



జాతీయ రహదారిపై మానవహారం నిర్వహిస్తున్న మహిళలు

కఠిన చట్టాలు అమలు చేయాలి

మహిళా సంఘం ఆధ్వర్యాన మానవహారం

ప్రజాశక్తి - సాలూరు

మహిళా రక్షణ చట్టాలను అమలు చేయడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలం కావొద్దని శ్రామిక మహిళా సంఘం జిల్లా కార్యదర్శి వి.ఇందిర, సిఐటియు జిల్లా కార్యదర్శి ఎన్వైనాయుడు కోరారు. శనివారం వారి ఆధ్వర్యాన మహిళలు పట్టణంలో జాతీయ రహదారిపై మానవహారం నిర్వహించారు. దేశంలో ఏదో ఒక చోట మహిళలు లైంగిక వేధింపులకు గురి కావడమో, హత్యాచారానికి గురి కావడమో జరుగుతుందని చెప్పారు. కోల్‌కత్తాలో జూనియర్ డాక్టర్‌పై హత్యాచారానికి పాల్పడిన సంఘటన జరిగి ఇన్ని రోజులైనా దోషులను శిక్షించడంలో బెంగాల్ ప్రభుత్వం విఫలమైందని చెప్పారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ఉండాలంటే మహిళా చట్టాలు పగడ్బందీగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. మోడీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మహిళలపై దాడులు, అత్యాచారాలు పెరిగాయని ఆందోళన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు రాజేశ్వరి, శ్రీదేవి, కన్నతల్లి పాల్గొన్నారు.

పోలమాంబకు వెండి హారం బహూకరణ

ప్రజాశక్తి - మక్కువ

ఉత్తరాంధ్ర ఆరాధ్య దేవత శంబర పోలమాంబ అమ్మవారికి కిలో 150 గ్రాముల సుమారు రూ.లక్షా 50వేలు విలువచేసే హారాన్ని భక్తులు అమ్మవారికి బహుకరించినట్లు ఆలయ ఇఒ సూర్యనారాయణ తెలిపారు. శనివారం శంబర గ్రామానికి చెందిన అల్లు జగన్ కుటుంబీకులు ఈ హారాన్ని బహూకరించినట్లు తెలిపారు.



పోలమాంబకు అందజేసిన వెండి హారం

బుడగరాయి ఆశ్రమ పాఠశాల సందర్శన

ప్రజాశక్తి - సీతంపేట

మండలంలోని బుడగరాయి ఆశ్రమ ఉన్నత పాఠశాలను డిప్యూటీ డిఇఒ పాలక నారాయుడు శనివారం సందర్శించారు. పదో తరగతి విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించాలని అన్నారు. టెన్త్ విద్యార్థులకు కొన్ని మేళకువలు నేర్పించారు. ఇప్పటి నుండే ప్రణాళిక ప్రకారం సాధన చేస్తే సులభంగా పదో తరగతి ఉత్తీర్ణత చెందవచ్చునని అన్నారు. కొన్ని ట్రిప్స్ గురించి సూచించారు. విద్యార్థులు ఎక్కువ మార్కులు తెచ్చుకోవడానికి కృషి చేయాలని ఆకాంక్షించారు. అలాగే రికార్డులను పరిశీలించారు. విద్యార్థుల ఆరోగ్యం గురించి తెలుసుకున్నారు. మరుగుదొడ్లు పరిశీలించారు. ఆర్వో ప్లాంట్ చూశారు. అనంతరం నారాయణగూడ పాఠశాలను సందర్శించారు. చిన్నారులతో ముచ్చటించి సామర్థ్యం తెలుసుకున్నారు ఆయనతో పాటు సిఎంఒ చిరంజీవి ప్రధానోపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

ఇ- పంట నమోదు వేగవంతం

ప్రజాశక్తి - సీతంపేట

ఇ పంట నమోదు వేగవంతం చేయాలని తహశీల్దార్ అప్పలరాజు, ఐటిడిఎ హార్టికల్చర్ ఆఫీసర్ వెంకట గణేష్, మండల వ్యవసాయ అధికారి శ్రీదేవి సిబ్బందికి సూచించారు. శనివారం ఆయాశాఖల సిబ్బందితో జరిగిన సమావేశంలో వారు మాట్లాడారు. ఫారం ల్యాండ్ సర్వేను గ్రామ వ్యవసాయ సహాయకులు, వీఆర్వో, సర్వేయర్స్ పూర్తి చేయాలని అన్నారు వీటిపై రైతులకు అవగాహన కల్పించాలన్నారు. తెగుళ్ల రాకుండా రైతులకు సూచనలు, సలహాలు అందించాలన్నారు. ఆయిల్ ఫామ్ మొక్కలు వేయడానికి రైతులకు అవగాహన కల్పించాలని, విస్తీర్ణం పెంచాలని అన్నారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ, రెవెన్యూ, సర్వే సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

జీడి మామిడి సాగుపై శిక్షణ

ప్రజాశక్తి - కురుపాం

జీడి మామిడి సాగుపై సచివాలయ గ్రామ వ్యవసాయ సహాయకులకు, హార్టికల్చర్ అసిస్టెంట్లకు రస్తా కుంటుబాయి కృషి విజ్ఞాన కేంద్రంలో శనివారం కెవికె ఉద్యానవన శాస్త్రవేత్త ఎన్. శ్రీనివాస్ రాజు శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జీడి మామిడి సాగు, యాజమాన్య పద్ధతులు, సస్య రక్షణకు తీసుకోవాల్సిన చర్యలపై శిక్షణ ఇచ్చారు. అనంతరం జీడి మామిడి సాగు రైతులందరికీ వీఎఎలు, హార్టికల్చర్ సిబ్బంది అవగాహన కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ వ్యవసాయ సహాయకులు నిర్మలజ్యోతి, కెవికె శాస్త్రవేత్తలు పాల్గొన్నారు.

రోడ్డుకిరువైపులా తుప్పలు తొలగించండి

ప్రజాశక్తి - కురుపాం

మండలంలోని మూలుగూడ జంక్షన్ నుంచి మూలుగూడ వరకు, బీరుపాడు జంక్షన్ నుండి దేరువాడ వరకు రోడ్డుకు ఇరువైపులా ఉన్నటువంటి జంగిల్ తొలగించి ప్రమాదాల నుండి రక్షణ కల్పించాలని శ్రీ కోటదుర్గమ్మ ఆటో యూనియన్ నాయకులు ఆర్ అండ్ బి అధికారులకు వినతిని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రోడ్డుకు ఇరువైపులా జంగిల్ ఎక్కువగా ఉండడంతో ఆటోలు, ఇతర వాహనాలు వెళ్తున్న సమయంలో ఎదురుగా వస్తున్న వాహనం కనిపించక ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. కావున తక్షణమే స్పందించి జంగిల్ తొలగించినట్లయితే ప్రమాదాలు జరగకుండా ఉంటాయని అన్నారు. కార్యక్రమంలో ఆటో యూనియన్ ప్రెసిడెంట్ రాయపిల్లి గంగులు, వైస్ ప్రెసిడెంట్ కలప శ్రీను, ఆటో యూనియన్ సభ్యులు బిడ్డక అప్పారావు, బి.కష్ణ, రాయపిల్లి గణేష్, కె.రంజిత్, ఆర్.కోటి, చిట్టి, బి.శ్రీకాంత్, కిషోర్, వినోద్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

నిధుల దుర్వినియోగంపై విచారణ జరిపించాలి

ప్రజాశక్తి - వీరఘట్టం

జగనన్న ఇళ్ల స్థలాల కోసం కొనుగోలు చేసిన భూములకు సంబంధించి నిధుల దుర్వినియోగంపై సమగ్ర విచారణ జరిపించాలని శనివారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణకు ఉదయాన ఉదయ్‌భాస్కర్, జామి లక్ష్మీనారాయణ, భోగి నారాయణరావు, తూముల రమేష్ వినతి పత్రం అందజేశారు. దళిత, గిరిజనులకు ఇచ్చిన డి-పట్టా భూములను అతి తక్కువ ధరకు కొనుగోలు చేసి ఎక్కువ డబ్బులకు కొనుగోలు చేసినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. వీటిపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై తగు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

సాహితీ మిత్రబృందం అధ్యక్షుడిగా చావలి

ప్రజాశక్తి - సాలూరు

స్థానిక సాహితీ మిత్రబృందం నూతన కార్యవర్గం ఎన్నిక శనివారం జరిగింది. అధ్యక్షునిగా చావలి శేషాద్రి సోమయాజులు, కార్యదర్శిగా ఆకుల గణపతి, కోశాధికారిగా షావుకారి చంద్రశేఖర్ ఎన్నికయ్యారని వ్యవస్థాపక అధ్యక్షులు జెబి తిరుమలాచార్యులు చెప్పారు. ఇంతవరకు కొనసాగిన కార్యవర్గం సేవలను కొనియాడారు.

విద్యార్థులకు అవగాహన

ప్రజాశక్తి - బలిజిపేట

: స్థానిక పిఎస్ఎన్ కాలేజీ శనివారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన స్థానిక హెడ్ కానిస్టేబుల్ రమేష్ మాట్లాడుతూ విద్యార్థులు మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలన్నారు. మాదకద్రవ్యాల వాడకం వల్ల ప్రాణాలను కోల్పోతారని తెలిపారు. అలాగే లైసెన్సు లేనివారు వాహనాలు నడప రాదని హెచ్చరించారు. ద్విచక్ర వాహనచోదకులు హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలని సూచించారు. అలాగే విద్యార్థులకు ఏ సమస్య ఉన్నా, ఎవరు ఇబ్బందులు పెట్టినా డయల్ నెంబర్ 100కి ఫోన్ చేసి సమాచారం ఇవ్వాలని అన్నారు. ఎటువంటి చెడు అలవాట్లకు లోనుకాకుండా సమాజంలో మంచి గుర్తింపు తెచ్చుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఎఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి రవి కుమార్, మనీ, వికాస్ పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి ప్రజా దర్బార్ : ఎమ్మెల్యే

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

ప్రజల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం ప్రజా దర్బార్ కార్యక్రమాలను ఏర్పాటు చేస్తుందని ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి అన్నారు. మండలంలోని కేదారిపురంలో శనివారం ప్రజాదర్బార్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పంచాయతీల్లో ప్రజా దర్బార్ నిర్వహించి ప్రజలు ఎదుర్కొంటున్న దాగు, సాగునీరు, విద్య, వైద్యం, రోడ్లు, గృహ నిర్మాణం వంటి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని అన్నారు. ప్రజా దర్బార్‌లో కేదారిపురం, వంగర గ్రామాల ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదులను స్వీకరించి వాటిని పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. ప్రజల నుంచి వచ్చిన ప్రతి ఫిర్యాదును సంబంధిత అధికారులు వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. గిరిజన గ్రామాలకు రహదారులు మంజూరు చేస్తామని, నిరుపేద కుటుంబాలకి ఇళ్ల మంజూరు చేస్తామని, ఇంటింటికీ కొళాయి వేస్తామని ఆమె అన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ తులసమ్మ, మండల టిడిపి కన్వీనర్ పాడి సుదర్శనరావు, ప్రధాన కార్యదర్శి పోలారు శ్రీనివాసరావు, జనసేన నియోజకవర్గ ఇన్చార్జి కె.మల్లేష్, ఎస్టీ సెల్ అధ్యక్షులు భూషణరావు, సీనియర్ నాయకులు బిడ్డిక పద్మావతి, కడ్రక కళావతి, వెంకట్రావు, బుజ్జేశ్వరరావు, అధ్యక్షుల నరేష్, పెద్దఎత్తున గిరిజనులు ప్రజా దర్బార్‌లో పాల్గొన్నారు.

మినీ రిజర్వాయర్ నిర్మించాలి ఎమ్మెల్యేకు రైతులు వినతి

మండలంలోని కేదారిపురం పంచాయతీలో పరిధిలో గల సీమలగూడ మినీ రిజర్వాయర్ నిర్మించి పంట పొలాలకు సాగునీరందించాలని ఇరిడి ఎంపిటిసి కడ్రక మల్లేశ్వరరావు, రైతులు కోరారు. ప్రజాదర్బార్ కార్యక్రమంలో ఎమ్మెల్యేకు వినతి అందించారు. సీమలగూడ వద్ద మినీ రిజర్వాయర్ నిర్మిస్తే కేదారిపురం కాలనీ, సీమలగూడ, నేరేడు మానుగూడ, జోబుగూడ, సెంటరిగూడ గ్రామాల పరిధిలో సుమారు 2వేల ఎకరాలకు సాగు నీరు అందుబాటులోకి వస్తుందన్నారు. సాగునీరు అందుబాటులో లేక రైతులు వర్షాధారంపైనే ఆధారపడి పంటలు పండిస్తున్నారని అన్నారు. గతంలో ఎన్నిసార్లు మినీ రిజర్వాయర్ కోసం అధికారులకు, ప్రజాప్రతినిధులకు విన్నవించినా నేటికీ పరిష్కారం చూపలేదన్నారు. రైతుల కష్టాలు గుర్తించి మినీ రిజర్వాయర్ నిర్మాణానికి చర్యలు చేపట్టాలని కోరారు.



మినీ రిజర్వాయర్ నిర్మించాలంటూ ఎమ్మెల్యేకు వినతిని అందజేస్తున్న రైతులు



కెజిబివి పాఠశాలను పరిశీలిస్తున్న మెజిస్ట్రేట్ సౌమ్య జాస్పిన్

విద్యార్థులకు మెరుగైన సదుపాయాలు కల్పించాలి

ప్రజాశక్తి - పార్వతీపురం రూరల్

విద్యార్థులకు మెరుగైన విద్య, వైద్య సదుపాయాలు అందించాలని అడిషనల్ జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ జె.సౌమ్యజాస్పిన్ తెలిపారు. శనివారం కవిటిభద్ర కెజిబివి బాలికల పాఠశాలను ఆమె తనిఖీ చేశారు. వసతిగృహంలో గల వసతులు, సమస్యలు గురించి విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థినుల ఆరోగ్యం పట్ల జాగ్రత్త వహించాలని, వారికి కావాల్సిన వైద్యసేవలందించాలని తెలిపారు. జాతీయ న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాల మేరకు కెజిబివి బాలికల వసతిగృహం తనిఖీ చేశామని ఆమె తెలిపారు. వసతిగృహంలో విద్యార్థినిలకు అందిస్తున్న బోజనం, హాస్టల్ వసతి, టాయిలెట్స్ తనిఖీ చేశారు. విద్యార్థినిలకు ఏమైనా సమస్యలుంటే తెలియజేయాలన్నారు.

తొలగించిన ఉద్యోగులను విధుల్లోకి తీసుకోవాలి

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

ఇటీవల ప్రభుత్వం మారిన తర్వాత రాష్ట్రంలోని వివిధ ప్రభుత్వ శాఖల పరిధిలో పనిచేస్తున్న కాంట్రాక్ట్, ఔట్సోర్సింగ్, డైలీ వేజ్ వర్కర్స్ అనేకమందిని రాజకీయ కారణాలతో తొలగించడం దుర్మార్గమైన చర్యని కాంట్రాక్ట్ ఔట్సోర్సింగ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ కన్వీనర్ బివి రమణ, సిఐటియు జిల్లా కోశాధికారి గొర్లి వెంకటరమణ విమర్శించారు. విద్యాశాఖ పరిధిలోని కెజిబివిలో పనిచేస్తున్న వంట మనుషులు, నైట్ వాచ్ ఉమన్‌లు, కంప్యూటర్ ఇన్‌స్ట్రక్టర్లను జిల్లాలో వివిధ ప్రాంతాల్లో తొలగించారని, ఇలాంటి చర్యలు ఈ ప్రభుత్వానికి మంచివి కాదని హెచ్చరించారు. గత ప్రభుత్వాన్ని అనేక సందర్భాల్లో విమర్శించిన ఈ ప్రభుత్వ పెద్దలు ఇప్పుడు అదే పద్ధతుల్లో కక్ష సాధింపులకు, తొలగింపులకు పాల్పడడం మానుకోవాలని హితవు పలికారు. లేకుంటే రాష్ట్ర వ్యాప్తంగా కాంట్రాక్ట్ ఔట్సోర్సింగ్ ఉద్యోగులతో ఆందోళన చేపడతామని హెచ్చరించారు. పార్వతీపురం మన్యం జిల్లాలో వివిధ ప్రాంతాల్లో తొలగించిన వారి జాబితాతో కూడిన వినతి పత్రాన్ని శనివారం డిఆర్ఒ కేశవనాయుడుకు అందజేశారు. దీనికి ఆయన స్పందిస్తూ ఈ సమస్యను జిల్లా విద్యాశాఖ అధికారి వారికి తెలియజేసి పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో కాంట్రాక్ట్ అవుట్సోర్సింగ్ ఫెడరేషన్ నాయకులు ఎం కుమారి, ఎస్.ఉష, కాంతమ్మ తదితరులు పాల్గొన్నారు..



డిఆర్ఒకు వినతిని అందజేస్తున్న సిఐటియు నాయకులు

ఉలిపిరి వసతి గృహంలో విచారణ

ప్రజాశక్తి - కొమరాడ

పార్వతీపురం ఐటిడిఎ పరిధిలో గల ఉలిపిరి గిరిజన సంక్షేమ బాలికల ఉన్నత ఆశ్రమ పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయురాలి ఫిర్యాదు మేరకు విచారణ నిర్వహించినట్లు ఐటిడిఎ డిప్యూటీ డిఇఒ సుగుణ అన్నారు. కలెక్టర్ అధికారుల ఆదేశాల మేరకు శనివారం ఈ విచారణ నిర్వహించారు. ఈ విచారణకు ఎంఇఒ జామి నారాయణస్వామి, ఆర్ఐ శ్రీనివాసరావు, డిప్యూటీ డిఇఒ కమిటీ ఏర్పాటుతో విచారణ నిర్వహించినట్లు వారు తెలిపారు. ఆశ్రమ పాఠశాలలో పనిచేస్తున్న ఒక ఉపాధ్యాయురాలు తమకున్న సమస్యపై జిల్లా కలెక్టర్‌తో పాటు మంత్రి సంధ్యారాణికి ఫిర్యాదు చేశారు. కలెక్టర్, మంత్రి ఆదేశాల ప్రకారం కమిటీ ఏర్పాటు చేసి విచారణకు ఆదేశించినట్లు సమాచారం. ఈ మేరకు కమిటీ సభ్యులు ఉలిపిరి గిరిజన సంక్షేమ శాఖ వసతి గృహానికి వచ్చి ప్రధానోపాధ్యాయులు కృష్ణారావుపై వచ్చిన ఆరోపణలపై విచారణ చేపట్టారు. వసతి గృహంలో తెలుగు ఉపాధ్యాయురాలిగా పనిచేస్తున్న సుజాత తనకు రావాల్సిన జిపిఎఫ్‌లోను చేయించేందుకు లంచం అడిగారని ఆమె ఫిర్యాదు చేశారు. దీంతోపాటు ఆమె ఎదుర్కొంటున్న సమస్యలను ఇప్పటికే మీడియా ద్వారా కలెక్టర్ మంత్రి వద్ద చెప్పిన విషయం తెలిసిందే. ఈ విషయాలు వాస్తవమా, కాదా అన్న ఉద్దేశంతో విచారణ చేపట్టారు. ఆమె పెట్టుకున్న లోన్ ఎంతవరకు సక్రమంగా ఉందా, లేదా, ఆమె తప్పుడు ఆరోపణలు చేశారా అన్న వివరాలను కమిటీ సభ్యులు సేకరించారు. అనంతరం పాఠశాలలో ఉన్న తోటి ఉపాధ్యాయులతో కూడా విచారణ చేపట్టి నివేదికలు సిద్ధం చేశారు. విచారణ నివేదికలను కలెక్టర్‌కు, మంత్రికి అందజేస్తామని కమిటీ సభ్యులు తెలిపారు.



పాచిపెంటలో నిరసన తెలుపుతున్న కార్మికులు, ప్రజాసంఘాల నాయకులు

ఫార్మా కంపెనీ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలి

ప్రజాశక్తి - పాచిపెంట

అనకాపల్లి జిల్లా అచ్యుతాపురం వద్ద గల ఎసెన్సియా ఫార్మా కంపెనీ ప్రమాదానికి కారణమైన యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని, మూసి ఉన్న పరిశ్రమలు తెరిపించి కార్మికులను ఆదుకోవాలని సిఐటియు, ప్రజాసంఘాల ఆధ్వర్యంలో శనివారం నిరసన కార్యక్రమం చేపట్టారు. ఆటో యూనిఎన్ కార్మిక సంఘం నాయకులు పిన్నింటి రమేష్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు కోరాడ ఈశ్వరరావు మాట్లాడుతూ అచ్యుతాపురం వద్ద గల ఎసెన్సియా ఫార్మా కంపెనీలో జరిగిన ప్రమాదానికి కారణమైన యాజమాన్యాన్ని చట్టపరంగా శిక్షించాలని, భవిష్యత్తులో ఇటువంటి ప్రమాదాలు జరగకుండా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అధికారుల హడావుడి తప్ప ప్రమాదకరమైన ఘటనకు కారణమైన వారిని శిక్షించడంపై ఎటువంటి చర్యలు చేపట్టడం లేదన్నారు. ఇప్పటికైనా ప్రమాదానికి కారణాలు తెలుసుకొని భవిష్యత్తులో ఇటువంటి ఘటనలు జరగకుండా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఆదివాసీ గిరిజన సంఘం మండల ఉపాధ్యక్షులు గమ్మెల అప్పారావు, రైతు సంఘం జిల్లా కమిటీ సభ్యులు బోను గౌరు నాయుడు, వివిధ ప్రజాసంఘాల నాయకులు, కార్మికులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరూ బాధ్యతగా మొక్కలు నాటి పర్యావరణాన్ని సమతుల్యం చేయాలని చేయాలని స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల వైస్ ప్రిన్సిపల్ డి.రామయ్య కోరారు. సిసిఇ ఆదేశాల మేరకు ప్రతినెలా నాలుగో శనివారం హరితహారం కార్యక్రమంలో భాగంగా ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో కళాశాల ఆవరణంలో అధ్యాపకులు, విద్యార్థులు మొక్కలు నాటించారు. పరిసరాలను పరిశుభ్రపర్చి ఆహ్లాదంగా తీర్చిదిద్దారు.

మక్కువ సమస్యలపై ప్రత్యేక దృష్టి

ప్రజాశక్తి - మక్కువ

మండలంలో ప్రస్తుతం ఉన్న సమస్యలతో పాటు మేజర్ పంచాయతీ మక్కువలో ప్రజలు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలపై ప్రత్యేక దృష్టి సారిస్తానని రాష్ట్ర గిరిజన, స్త్రీ శిశు సంక్షేమ శాఖా మంత్రి గుమ్మడి సంధ్యారాణి హామీ ఇచ్చారని టిడిపి సీనియర్ నాయకులు మావుడి ప్రసాద్‌నాయుడు తెలిపారు. శనివారం ఆయన సాలూరులో మంత్రి సంధ్యారాణిని ఆమె నివాసం వద్ద కలిశారు. ఈ సందర్భంగా గ్రామ సభలో మక్కువ ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు పేర్కొనడం, అలాగే ఆ సమస్యలను మంత్రి దృష్టిలో కూడా పెట్టామన్నారు. మక్కువలో ఉన్న ప్రతి సమస్యను పరిష్కరిస్తామన్నారని ఆయన వివరించారు.

ముత్యాలు స్మృతి వనంకు తోడ్పాటు

సాలూరు మాజీ ఎమ్మెల్యే, ప్రస్తుత మంత్రి సంధ్యారాణి తండ్రి జన్ని ముత్యాలు పేరున స్మృతి వనం ఏర్పాటు చేసేందుకు తోడ్పాటు అందించాలని ప్రసాద్ నాయుడు మంత్రిని కోరారు. స్థానిక బైరిసాగరం చుట్టూ సిమెంటు రహదారి ఏర్పాటు చేసి ఆహ్లాదకరమైన వాతావరణం కలిగించేలా మొక్కలు నాటి కార్యక్రమం చేపట్టడానికి సహకరించాలని, మండల కేంద్రం మధ్యలో గల ఆ ప్రదేశాన్ని అభివృద్ధి చేసి, దాన్ని ముత్యాలు స్మృతి వనంగా చేయాలని అనుకుంటున్నట్లు ఆయన తెలిపారు. ఈ మేరకు మంత్రికి కూడా వివరించడం జరిగిందని తప్పకుండా తోడ్పాటు అందిస్తామని హామీ ఇచ్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో టిడిపి శ్రేణులు నరసింహమూర్తి తదితరులు పాల్గొన్నారు.

విత్తన శుద్ధిపై అవగాహన

ప్రజాశక్తి - పాచిపెంట

రైతులు విత్తనాలను వేసుకునే ముందు మేలైన రకాలను ఎంపిక చేసుకుని విత్తన శుద్ధి చేసిన తర్వాత మాత్రమే నాటుకోవాలని, లేదా నారు శుద్ధి చేసుకుని నాటుకోవాలని మండల వ్యవసాయ అధికారి కె.తిరుపతిరావు అన్నారు. మండలంలోని పెదకంచూరులో నిర్వహించిన మేలైన వ్యవసాయ పద్ధతుల పొలంబడి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీజన్ దాటకుండా అధిక దిగుబడి పొందాలంటే మేలైన విత్తన రకాలను ఎంపిక చేసుకోవాలన్నారు. నారు తీసి వేళ్లను పై మందుల్లో ఒక దాన్ని నీటిలో కలిపి వేళ్ళ మునిగి ఉండేలా గంట పాటు ఉంచి నాటుకోవచ్చని తెలిపారు. అనంతరం వరుసల్లో వేసిన చోడిపంటకు గత వారం పొలంబడిలో తయారు చేసిన ద్రవ జీవామృతాన్ని పోయించారు. గట్లపై కంది విత్తనాలు నాటుకోవాలని తెలియజేస్తూ కంది విత్తనాలను రైతులకు పంపిణీ చేశారు. అనంతరం చాపరాయివలస, కన్నయ్యవలసలో పత్తి, వరి పంటలను పరిశీలించి వాటిలో పక్షిస్తావరాలను ఏర్పాటు చేశారు. పక్షిస్తావురాళ్ళ ఏర్పాటు చేయడం ద్వారా పక్షులు వాటిపై వాలి పంటలో ఉన్న పురుగులను తింటాయని, తద్వారా పురుగు ఉధృతి బాగా తగ్గుతుందని తెలిపారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ ప్రతినిధులు సురేష్ కుమార్, విజయ్‌రాజు, వివిఎలు భారతి, కిరణ్ రైతులు పాల్గొన్నారు.

ఎరువుల కొరతపై ఎమ్మెల్యే ఆగ్రహం

వాగ్వివాదాలతో గందరగోళంగా మారిన మండల సర్వసభ్య సమావేశం

ప్రజాశక్తి - వీరఘట్టం

మండలంలోని ఎరువుల కొరత, సమావేశానికి సభ్యులు కానివారు హాజరు కావడంతో తదితర అంశాలపై జరిగిన చర్చ రసాభసాగా సాగింది. అధికార, ప్రతిపక్షాల మధ్య వాద ప్రతివాదాలపై నడుమ గందరగోళంగా మారింది. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శనివారం ఎంపిపి డి.వెంకటరమణ నాయుడు అధ్యక్షతన జరిగిన మండల సర్వసభ్య సమావేశం జరిగింది. తొలుత వ్యవసాయ శాఖకు సంబంధించి ఎఒ జె.సౌజన్య మాట్లాడుతూ మండలానికి ఇప్పటివరకు 75 మెట్రిక్ టన్నుల ఎరువులు వచ్చినట్లు తెలిపారు. దీనికి ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ స్పందిస్తూ మండలంలో ఎన్ని ఎకరాల విస్తీర్ణంలో పంట సాగవుతుందని ప్రశ్నించగా 17 వేల ఎకరాల్లో సాగుతుందని సమాధానం ఇచ్చారు. ఎన్ని మెట్రిక్ టన్నులు ఎరువులు అవసరమని ప్రశ్నించగా, 732 మెట్రిక్ టన్నుల ఎరువులు అవసరముందని జిల్లా అధికారులకు నివేదిక ఇచ్చినట్లు ఆమె తెలిపారు. డిఎపి ఎందుకు ఇండెంట్ పెట్టలేదని ప్రశ్నించారు. మా దృష్టికి తీసుకొస్తే ఎరువులు తెచ్చేందుకు చర్యలు తీసుకుంటాం కదా అని ఎమ్మెల్యే అన్నారు. ప్రస్తుతం ఎరువులు అందుబాటులో లేకపోవడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారనిమండల టిడిపి అధ్యక్షులు ఉదయాన ఉదయ్ భాస్కర్ సభ దృష్టికి తీసుకువచ్చారు. తూడి సర్పంచి కె.వెంకటరమణ మాట్లాడుతూ ఇటీవల తమ గ్రామానికి వచ్చిన ఎరువులను ప్రైవేట్ వ్యక్తుల చేతిలో పెట్టారని, కనీసం నెలకు ఒకసారైన గ్రామానికి వచ్చారా? మండలంలో అత్యధికంగా తమ గ్రామంలోనే వరి సాగవుతుందని, ఈ సమయంలో రైతులకు అందుబాటులో ఉండి వారికి కావాల్సిన ఎరువులను అందజేయకపోవడం దారుణమని అన్నారు. రైతు సేవా కేంద్రాల్లో ఎరువులు అందుబాటులో లేకపోయినప్పటికీ ప్రైవేట్ డీలర్ వద్ద ఎరువులు కొనుగోలు చేద్దామన్న ఇంకొక వస్తువు ముడిపెట్టి విక్రయాలు చేస్తున్నారని, కనీసం వారి పైన చర్యలు తీసుకుంటున్నారా అని ప్రశ్నించారు. దీనికి ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎరువులు షాపుల్లో కల్తీ ఎరువులు అమ్ముతున్నారని, ఆ షాపులైనా పరిశీలిస్తున్నారా అని ప్రశ్నించారు. ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ మాట్లాడుతూ మండల సర్వసభ్య సమావేశానికి ఎన్నుకోబడిన సభ్యులు హాజరు కావాలి తప్ప ఇతరులు హాజరు కాకూడదని అనేసరికి ఉదయ భాస్కర్ కలుగజేసుకొని గతంలో మీరు కూడా ఎన్నికల్లో పోటీ చేయని వారిని సమావేశాలు జరిపించారని అన్నారు. దీనికి నీలానగరం సర్పంచి వావిలపల్లి బాబు, పురుషోత్తంరావు లేవడంతో కొంతసేపు గందరగోళం ఏర్పడింది. ముందుగా పసిగట్టిన పోలీసులు మండల పరిషత్ సమావేశం మందిరం వద్ద ఉండడంతో ఇరుపక్షాలను సముదాయించి సమావేశాన్ని ముందుకు కొనసాగించారు. అనంతరం తహశీల్దార్ సిహెచ్ సత్యనారాయణ మాట్లాడుతూ ఎండియు ద్వారా లబ్ధిదారులకు సరుకులు పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. ఉదయాన ఉదయ్ భాస్కర్ కలుగజేసుకొని గతంలో ఎమ్మెల్యే అధికారులతో సమీక్షించే జగనన్న ఇళ్ల స్థలాల పంపిణీలో అవినీతి జరిగిందని, వాటికి సంబంధించి నివేదిక అడిగినప్పటికీ ఎందుకు ఇంతవరకు ఇవ్వలేదని ప్రశ్నించారు. హౌసింగ్ ఎఇ వినోద్ కుమార్ మాట్లాడుతుండగా తుడి సర్పంచి మాట్లాడుతూ ఇళ్ల నిర్మాణాలు పూర్తయినా ఇప్పటికీ బిల్లులో చెల్లించలేదన్నారు. చలివేంద్రిలో రక్షితమంచినీటి పథకం ఏర్పాటు చేసినా పైపులైన్లు ఇవ్వలేదని ఆ గ్రామ సర్పంచి పోరెడ్డి వెంకటనాయుడు ఫిర్యాదు చేశారు. దీనికి ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామంలో తాగునీటి సమస్య తీవ్రంగా ఉందని, తక్షణమే చర్యలు తీసుకోవాలని జెసిని ఆదేశించారు. నీటిపారుదల శాఖకు సంబంధించి బి.శంకర్రావు మాట్లాడుతుండగా చలివేంద్రిలో సాగునీటి సమస్య ఉందని, గట్లు బలహీనంగా ఉండడంతో ఎక్కడపడితే అక్కడ నీరు లీక్ అవుతుందని అన్నారు. వైద్య, విద్య, ఉపాధి, పంచాయతీ రాజ్, పశు వైద్య తదితర శాఖలకు సంబంధించి సమీక్ష నిర్వహించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ మండలంలోని సమస్యలను గుర్తించి తమ దృష్టికి తీసుకొస్తే మండలాన్ని అభివృద్ధి పథంలో నడిపించేందుకు కషి చేస్తానన్నారు. శివారు భూములకు సాగునీరందించేందుకు అధికారులు సమన్వయం చేసుకోవాలని సూచించారు. సమావేశంలో ఎంపిడిఒ వై.వెంకటరమణ, వైస్ ఎంపిపి పి.విజయకుమారి, వి.భార్గవ్, తోటపల్లి మాజీ చైర్మన్ నిమ్మక పాండురంగ, నాయకులు పి.కృష్ణమూర్తినాయుడు, సర్పంచులు, ఎంపిటిసి సభ్యులు పాల్గొన్నారు.



సాగునీటి సమస్యపై అధికారులను నిలదీస్తున్న సభ్యుడు

వీరఘట్టం ఎస్ఐగా కళాధర్

ప్రజాశక్తి - వీరఘట్టం

స్థానిక ఎస్ఐగా జి.కళాధర్ శనివారం బాధ్యతలు స్వీకరించారు. పార్వతీపురం మన్యం జిల్లా కేంద్రంలో సిసిఎస్‌లో విధులు నిర్వహిస్తూ బదిలీపై ఇక్కడికి వచ్చారు. ఇప్పటివరకు ఇక్కడ విధులు నిర్వహించిన ఎస్‌కె ఫక్రుద్దీన్ విఆర్‌లో ఉన్నారు.

ఎస్ఐగా ప్రయాగమూర్తి

పాలకొండ : స్థానిక ఎస్సైగా ప్రయాగమూర్తి శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పని చేసిన ఎస్సై ప్రశాంత్ కుమార్ విఆర్‌కు వెళ్లారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ ట్రాఫిక్ సమస్యలను పరిష్కరిస్తానని, శాంతిభద్రతలు కల్పిస్తానని అన్నారు.

నేరాలు ఘోరాలు

వంశధారలో జారి పడి వ్యక్తి మృతి

ప్రజాశక్తి - భామిని

మండలం తలాడకు చెందిన వలురౌతు నిరంజన్ (48) ప్రమాదవశాత్తూ వంశధార నదిలో పడి మృతి చెందిన ఘటన శనివారం చోటుచేసుకుంది. వివరాలకు వెళితే తలాడకు చెందిన నిరంజన్ ఇంటి అవసరాలు నిమిత్తం సరుకులు కొనడానికి వంశధార నదిని ధాటి ఒడిశాలోని కాశీనగర్‌కు గురువారం వెళ్లాడు. గురువారం సాయంత్రం నిరంజన్ ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు బంధువులకు సమాచారం అందించి వెతికారు. పోలీసులకు సమాచారం అందించారు. శుక్రవారం ఉదయం వంశధార నది ఉధృతంగా ప్రవహిస్తుండడంతో నది దాటే క్రమంలో ఏమైనా జరిగిందా అని ఆరోజు నదిలో గాలించారు. సాయంత్రం వరకు వెతికినా ఎటువంటి ఆచూకీ లభించలేదు. శనివారం ఉదయం నదిలో వెతకడం ప్రారంభించగా, తలాడకు మూడు కిలోమీటర్ల దూరంలో కీసర వద్ద మృతదేహం లభ్యమైంది. కాశీనగర్ నుండి తిరుగు వచ్చే క్రమంలో పడవ లేకపోవడంతో కాలి నడకన నది దాటే క్రమంలో ప్రమాదం జరిగి ఉంటుందని కుటుంబీకులు అనుమానిస్తున్నారు. బత్తిలి పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు. నిరంజన్‌కు భార్య శారద, ఇద్దరు ఆడపిల్లలు ఉన్నారు.

చెరువులో పడి యువకుడు మృతి

ప్రజాశక్తి పార్వతీపురం రూరల్

మండలంలోని నర్సిపురం పంచాయతీ కారాడవలస సమీపంలో చెరువులో పడి యువకుడు మరణించిన సంఘటన చోటు చేసుకుంది. శనివారం పాముల శివ శేషు బహిర్భూమికి వెళ్లి అనంతరం చెరువులోకి దిగాడు. అయితే ఇటీవల కురిసిన వర్షాలకు చెరువు నిండిపోయి ఉండడంతో లోతు అంచనా వేయక పోవడంతో మునిగిపోయి, మృతిచెందినట్లు గ్రామస్తులు తెలియ చేస్తున్నారు. విషయం తెలుసుకున్న పోలీసులు వివరాలు సేకరిస్తున్నారు.

అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్లు పట్టివేత

ప్రజాశక్తి - కొమరాడ

నదీ పరీవాహక ప్రాంతం నుంచి ఇసుక అక్రమంగా రవాణా చేస్తున్న రెండు ఇసుక ట్రాక్టర్లను పట్టుకున్నట్లు ఎస్సై నీలకంఠం తెలిపారు. శనివారం స్థానిక పోలీస్ స్టేషన్లో ఆయన విలేకరులతో మాట్లాడుతూ శుక్రవారం రాత్రి ఇసుకను అక్రమంగా తరలిస్తున్నట్లు సమాచారం రావడంతో తమ సిబ్బందితో వెళ్లి దాడులు నిర్వహించామని తెలిపారు. ఈ దాడుల్లో కోటిపాం నుంచి ఇసుక అక్రమ రవాణా చేస్తున్నట్లు గుర్తించామన్నారు. అక్రమంగా ఇసుకను తరలిస్తున్న రెండు ఇసుక ట్రాక్టర్లు స్వాధీనం చేసుకున్నామన్నారు. స్వాధీనం చేసుకున్న ట్రాక్టర్లను పోలీస్ స్టేషన్‌కు తరలించి ట్రాక్టర్ యాజమానులపై కేసు నమోదు చేశామని తెలిపారు.

50 లీటర్ల నాటు సారా స్వాధీనం

సీతంపేట : స్థానిక ఎస్ఐ జగదీష్‌నాయుడు తన సిబ్బందితో మండంలోని చిన్నబగ్గ గ్రామ సందర్శనకు వెళ్లారు. ఆ సమయంలో ఒక వ్యక్తి నాటుసారాను తరలిస్తుండగా పోలీసు పట్టుకొనేందుకు ప్రయత్నించగా, సారా విడిచిపెట్టి తప్పించుకొని పారిపోయాడు. అక్కడే ఉన్న 50 లీటర్ల నాటు సారాను స్వాధీనం చేసుకున్నారు. ఎస్ఐ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

పశువుల వ్యాన్ పట్టివేత

సీతంపేట: మండలంలోని ఎంఆర్‌సి జంక్షన్ వద్ద ఎస్ఐ జగదీష్‌నాయుడు వాహనాలు తనిఖీ చేస్తుండగా బొలెరో పిక్ అప్ వ్యాన్‌లో 14 పశువులను తరలిస్తుండగా పట్టుకున్నారు. వీటికి గడ్డి, నీరు లేకుండా, వాటి కదలికలకు ఏమాత్రం ఆస్కారం లేకుండా, ఇరుకైన వాహనంలో తరలిస్తున్నారు. దీంతో డ్రైవర్‌పై కేసు నమోదు చేసి, 14 పశువులను గోశాలకు తరలించినట్టు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

గోడను ఢీకొన్న వ్యాను : నలుగురికి గాయాలు

సాలూరురూరల్ : పెళ్లికి వెళ్లి వస్తుండగా గోడను ఢీ బొలెరో వ్యాను ఢీకొన్న సంఘటనలో నలుగురు గాయపడ్డారు. ఈ సంఘటనకు సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. మండలంలో మరిపల్లి పంచాయతీ బూతాడ కర్రివలసకు చెందిన వారు కొండవెలగాడ వివాహానికి హాజరై తిరిగి స్వగ్రామానికి బొలోరా వ్యాన్‌పై వస్తుండగా మామిడిపల్లి విద్యుత్ సబ్ స్టేషన్ కార్యాలయ గోడకు కొంది. ఈ సంఘటనలో వ్యాన్ డ్రైవర్ బాసి శ్రీనుతో పాటు మరో ముగ్గురికి గాయాలయ్యాయి. దీంతో వీరికి మామిడిపల్లి పిహెచ్‌సిలో ప్రథమ చికిత్స చేసి, అక్కడ నుండి సాలూరు ఏరియా ఆసుపత్రికి తరలించారు. రూరల్ పోలీసులు కేసును దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ ఐ వెంకటరమణ తెలిపారు.